




## (ప్రారంభం)

ఒక నిశ్శబ్దం ఎన్నో కథలు చెప్తుంది. ఆ కథలు సుదీర్ఘమైన ఒక జీవితాన్ని ఆవిష్కరిస్తాయి. ఒక నిశ్శబ్దం చరిత్రని సృష్టిస్తుంది... మరో చరిత్రను పునరావృతం చేస్తుంది. నిశ్శబ్దం బద్దలైతే!

ఆమె మెల్లగా కళ్ళు తెరిచింది.

తెల్లటి గోడలు ట్యూబు లైట్ వెలుగులో మెరిసిపోతూ కనిపించాయి. పైన సీలింగ్ ఫ్యాన్ నిదానంగా తిరుగుతోంది. ఆమె కనురెప్పలు అటూ, ఇటూ దేనికోసమో అన్వేషిస్తున్నట్టు కొన్ని క్షణాలు రెప, రెపలాడుతూ చంచలంగా కదిలాయి. ఆమె పడుకున్న మంచానికి రెండు అడుగుల దూరంలో ప్లాస్టిక్ కుర్చీ మీద కూర్చున్న వ్యక్తి వైపు ఆ చూపులు ఆగిపోయాయి. అక్కడ కూర్చున్న వ్యక్తి కళ్ళు మూసుకుని కుర్చీలో వెనక్కి వాలి ఉన్నాడు. ఆ వాలడంలో అలసట కనిపిస్తోంది. ఆయన వయసు సుమారు డెబ్బై పైన ఉంటుంది.

చాలా కాలం తరువాత ఆమె ఆయన వైపు పరిశీలనగా చూసింది.

ఆయన చేత మూడు ముళ్ళు వేయించుకుని, కాపురం మొదలుపెట్టాక మొదటిసారి ప్రేమగా చూసింది.

ముప్పై ఏళ్ల తరవాత ఆయన వైపు నా మనిషే కదా అన్నట్టు చూసింది.

ఆవిడ చూపుల్లో జాలి, ఆవిడ చూపుల్లో నిశ్చింత...

జీవితంలో మొదటిసారి తనకి సేవలు చేస్తున్నాడు.

ఎప్పుడూ తను అతనికి చేయడమే. ఎన్నో సేవలు... నిద్రలేచాక టూత్ బ్రష్ అందించడం దగ్గర నుంచి రాత్రి పడుకునే ముందు పాలగ్లాసు వరకు... ఎన్ని సేవలు! ఆయనకి సేవలు చేయడానికే ఆ భగవంతుడు తనని సృష్టించినట్టు.

కానీ, ఇప్పుడు, ఈ పదిహేను రోజులుగా ఆయన సేవ చేస్తున్నాడు. అదికూడా మొక్కుబడిగా కాకుండా బాధ్యతగా.

అకస్మాత్తుగా తనపట్ల ఆయన చూపిస్తున్న బాధ్యత ఆవిడకి విస్మయాన్ని కలిగిస్తోంది.

పొత్తిళ్లలో పాపాయిని కనిపెట్టుకుని ఉన్నట్టు, సుమారు పదిహేను రోజులుగా తనని కనిపెట్టుకుని నిద్రాహారాలు మర్చిపోయినట్టుగా చూస్తున్నాడు.

కూతురు నాతో తీసుకుని వెళ్తాను అమ్మని అని చెప్పినా ఒద్దని నిరాకరించి, ఎంత ప్రేమగా చూస్తున్నాడు! ఎలా కలిగింది ఇంత ప్రేమ! ఇది ప్రేమేనా!

నిట్టూర్చింది.

గొంతు తడారిపోతోంది. ఒక చుక్క నీళ్ళు గొంతులో దిగితే బాగుండు. "ఏవండీ!" కంఠం పెగిలి శబ్దం రాలేదు.

పాపం! అప్పుడే కాస్త విశ్రాంతిగా కళ్ళు మూసుకున్నట్టున్నాడు. లేపడం ధర్మం కాదు.

ఆమె పెదవుల మీద శుష్కహాసం మెరిసింది.

స్త్రీ హృదయానికి ఎంత జాలి!

ఇరవై ఏళ్లపాటు రోజంతా అతని తల్లి,తండ్రులకి చాకిరీ చేసి, చేసి అలసిపోయి, ఒళ్లుమరచి నిద్రపోతున్నప్పుడు ఆయన ఎన్నో సార్లు నిర్దయగా తనని లేపడం ఆమె మరచిపోగలదా!

ఎన్నో జ్ఞాపకాలు... సుదీర్ఘమైన ఈ జీవితంలో, అతనితో కలిసి వేసిన ఎన్నో వేల అడుగుల ప్రయాణంలో అనేక స్మృతులు... కొన్ని మధురం... మరికొన్ని...?

సన్నగా గురక వినిపిస్తోంది. తల కొద్దిగా పక్కకి వాలింది. ఆమె హృదయం ద్రవించింది. వాలిన తల సరి చేయాలని, కుర్చీ నుంచి లేపి, మంచం మీద పడుకోపెట్టాలని ఆరాటపడింది ఆమె హృదయం.

కానీ, నిస్సహాయురాలు. తనిప్పుడు అతనిమీద ఆధారపడి ఉంది. లేవలేదు. లేవగలిగితే కొంచెం దూరంలో ఒక మూల టేబుల్ మీద ఉన్న జగ్ లో నుంచి నీళ్ళు గ్లాసులో పోసుకుని తాగగలుగును కదా!

దాహంతో నాలుక పిడచగడుతోంది. అతన్ని లేపాలి. తప్పదు. కానీ, కానీ ఏదో అడ్డొస్తోంది. ఏమిటది? జాలా! ప్రేమా!

ఆ ప్రేమ, జాలి తనమీద అతనికి లేకనేగా ఎన్నోసార్లు అలసిన తన శరీరాన్ని నిర్దయగా నలిపాడు గాఢ నిద్రలో ఉన్న తనపైన ఏ మాత్రం కనికరం లేకుండా!

ఇప్పుడు తను లేపితే ఏం?

కేవలం మంచినీళ్ళ కోసం కాదు. తను నోరు తెరిచి చేసిన ప్రార్ధన విన్నాడా! విని ఎలాంటి చర్య తీసుకున్నాడు అడగాలి.

ఇన్నేళ్ళలో ఎన్నడూ ఏ కోరికా కోరని తను ఒక కోరిక కోరింది.

ఆ కోరిక విన్న అతని కళ్ళల్లో విస్మయంతో పాటు ఏదో భావం కదిలింది. అది ఏమై ఉంటుంది!

ఏమైనా తను కోరిన కోరిక ఏం చేసాడో అడగాలి.

ఆ కోరిక సమంజసమా! కాదా! ఆలోచించే సమయం కాదు.

నిజానికి సమయం మించిపోతోంది. ఇప్పుడు ఆ కోరిక తీరకపోతే తను ఇలాగే క్రమంగా శాశ్వత సుషుప్తిలోకి జారిపోతుంది. ఆ తరవాత… ఆ తరవాత …

సన్నగా నిట్టూర్చింది. ఆ నిట్టూర్పునుంచి వెలువడిన శ్వాస చేసిన ధ్వనికి ఆయన ఉలిక్కిపడ్డాడు. నిద్రతో సోలుతున్న కళ్ళు విచ్చుకున్నాయి.

గబుక్కున కుర్చీ ఆమె మంచానికి దగ్గరగా జరుపుకుని కొంచెం ఆమె వైపు వొంగి ఆదుర్దాగా అడిగాడు .

"ఏం కావాలి?"

ఆమె కొన్ని క్షణాలు మౌనంగా ఆయన కళ్ళల్లోకి చూసి కుడిచేయి బొటనవేలు చూపించింది.

ఆయన టేబుల్ దగ్గరకు నడిచాడు. ఆ నడక తడబడుతోంది. పొడుగ్గా, నిటారుగా ఉండే ఆయన కొంచెం ఒంగి నడుస్తున్నాడు. ఆ నడకలో ఇప్పుడు దర్పం లేదు, ఆసరా దొరక్క పాదాలతో బలంగా నేలను వత్తుతూ, నిస్సహాయంగా వేస్తున్న అడుగులు.

మగ్ లో నీళ్ళు గాజుగ్లాసులో సగానికి పోసి, తీసుకు వచ్చాడు.

ఆమె కొద్దిగా నడుం ఎత్తి, తలతోటే తలగడని జరుపుకుని నోరు తెరిచింది. ఆయన నెమ్మదిగా, జాగ్రత్తగా ఆమె గొంతులో నీళ్ళు పోసాడు. రెండు గుటకలు వేసి 'చాలు' అన్నట్టు చూసి వెల్లకిలా పడుకుంది.

ఆయన గ్లాసు టేబుల్ మీద పెట్టి వచ్చి, కొంచెం ఆమె మీదకి ఒంగి అడిగాడు "ఇంకా ఏమన్నా కావాలా!"

ఆయన కళ్ళల్లోకి సూటిగా చూసింది.

ఆ క్షణం, ఆమె కళ్ళల్లో ఆయనకి కొడిగడుతున్న దీపం లాంటి చిన్న ఆశ అటూ, ఇటూ కదిలింది ఆమె చూపులతోపాటు.

ఆయనకి అర్థం అయింది ఆమె ఏం అడగబోతోందో!

ఊపిరి బిగపట్టుకున్నాడు.

"ఫోన్ చేసారా?"

అడగద్దు అనుకున్న ప్రశ్న అడిగింది. ఆ ప్రశ్నకి ఆయన దగ్గర సమాధానం లేదు… ఉన్నా బయటకి రాదు. అందుకే ఆమె ఆలోచన నుంచి మళ్ళించే ప్రయత్నంగా, నెమ్మదిగా అడిగాడు "జ్యూస్ ఇవ్వనా? తాగుతావా?"

ఆమె తల అడ్డంగా తిప్పుతూ గొంతు పెగుల్చుకుని మళ్ళీ అడిగింది "ఫోన్ చేశారా?".

ఆయన మొహం మ్లానమైంది. నిటారుగా ఆయాడు.

ఈ ప్రశ్న రాకూడదని ప్రతిక్షణం అనుకుంటున్నాడు. ఆ ప్రశ్న వచ్చింది. వస్తుంది... వస్తూనే ఉంటుంది. ఇదివరకులా ఇంకోసారి ఆ ప్రశ్న అడక్కు అని కఠినంగా చెప్పలేకపోతున్నాడు. సమాధానం చెప్పకపోవడం ఒక అపరాధంలాగే తోస్తోంది ఆయనకి. చెప్పాలి సమాధానం చెప్పాలి. అది అబద్ధం అయినా చెప్పాలి.

ఆమె మొహం మీద నుంచి చూపులు తిప్పి అస్పష్టంగా అన్నాడు "చేశాను... లిఫ్ట్ చేయలేదు".

మంచు రాలినట్టు ఆమె కనురెప్పల మీద ఉబుకుతున్న కన్నీటి చుక్కలు నిలిచాయి. కళ్ళు మూసుకుంది.

ఆయన గుండె బరువెక్కింది ... దుఖం ఎగసి పడింది. కన్నీటి చినుకులు రాలకుండా అదిమిపట్టాడు.

"మళ్ళీ చేయరా ప్లీజ్" అంది .

ఆయన మొహం పక్కకి తిప్పుకుని, చిటికెన వేలితో రెప్పలు దాటని కన్నీటి చినుకును తుడిచి ఆమె తల మీద చేయి వేసి నిమురుతూ "చేస్తాను" అన్నాడు.

"ఒక్కసారి చూడాలని ఉందండి. ఇంక అయిపోయింది. చూశారా! యమధర్మ రాజు దున్నపోతు ఎక్కాడు... భటులు అనుసరిస్తున్నారు. నేనింక ఎక్కువ కాలం బతకనండి ఒక్కసారి, ఒకే ఒక్కసారి చూసి క్షమార్పణ అడగాలని ఉంది. ఇన్నేళ్ళ మన సహచర్యంలో నేనెప్పుడూ మిమ్మల్ని ఏమీ అడగలేదు కదూ! ఇదే మొదటి, ఆఖరి ప్రార్ధన... ఒక్కసారి... ఒకే ఒక్కసారి అతన్ని చూడాలి... మాట్లాడాలి... లేకపోతే నా ఆత్మ శాంతించదు... మోహన్ చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటుంది... నేనతనికి మిగిల్చిన శోకం నన్ను దహించివేస్తోందండి." ఆమె స్వరం రుద్ధమైంది.

"అలాగే! తప్పకుండా చేస్తాను. అతను వస్తాడు. నువ్వు విశ్రాంతి తీసుకో" ఆమె నుదుటి మీద ప్రేమగా రాశాడు.

ఆమె ఆయన వైపు అలాగే ఆశగా చూస్తూ కళ్ళు మూసుకుంది. ఆయన సుదీర్ఘంగా నిట్టూర్చి దుప్పటి సరిగా కప్పి, తలుపు ఓరగా లాగి, గదిలోంచి బయటకి నడిచాడు.

అప్పుడే లోపలికి రాబోయిన మధురిమ చెవిలో తల్లి ప్రశ్న, తండ్రి దాటేసిన సమాధానం నిశ్శబ్దనాదంలా నినదించింది.

గుమ్మం దాటి వస్తున్న ఆయన్ని చూసి ఆగిపోయి ఆయన మొహంలోకి సూటిగా చూసింది. "నాన్నా! మోహన్ ఎవరు?" అని అడిగింది.

ఆయన అదిరిపడ్డాడు. మధు విన్నదా తమ సంభాషణ!?

నోటినుంచి శబ్దం రాలేదు. సమాధానం చెప్పలేదు. ఎవరని చెప్పాలి?

"అమ్మ ఎందుకు అతన్ని చూడాలని తపిస్తోంది! పదిరోజుల నుంచి చూస్తున్నా ... ఆవిడ ఫోన్ చేశారా అని అడుగుతూనే ఉంది... నువ్వు ఇదే సమాధానం చెప్తున్నావు. చెప్పు నాన్నా... ఎవరు మోహన్?" నిలదీసినట్టుగా అడుగుతున్న కూతురి వైపు నిస్సహాయంగా చూసాడు.

"ఈ ఇంట్లో నాకు తెలియని రహస్యాలు ఉన్నాయా? మొదటి నుంచీ ఉన్నాయా? నా పెళ్లి అయి నేను వెళ్ళిపోయాక కొత్త రహస్యాలు వచ్చాయా? చెప్పునాన్నా!"

ఏమని చెప్పాలి? ఈ ప్రశ్నకి తన దగ్గర సమాధానం ఉందా? అసలు సమాధానం చెప్పే అర్హత తనకి ఉందా? లేదు... లేదు... ఆయన మౌనంగా ఉండిపోయాడు.

ఆ మౌనం మధురిమకి నచ్చలేదు. అనేక సందేహాలకి ఆ మౌనం తావిస్తోంది. ఎవరీ మోహన్? అమ్మ, నాన్నలకి అతనితో ఉన్న అనుబంధం ఏంటి? ఎందుకు అమ్మ ఈ చివరి రోజుల్లో అతన్ని కలవాలని తపిస్తోంది.

తన పెళ్లి అయి అత్తవారింటికి వెళ్ళి కూడా మూడేళ్లు దాటుతోంది. సుమారు పాతికేళ్లు ఈ ఇంట్లో, ఈ తల్లి తండ్రుల దగ్గర పెరిగిన తనకి తెలియని ఈ వ్యక్తి ఎవరు? ఈ ఇంట్లో అతని స్థానం ఏంటి? ఏ అనుబంధం లేకుండా అమ్మ అవసాన దశలో ఎందుకు అతని కోసం ఎదురు చూస్తోంది? నాన్న ఎందుకు అతన్ని పిలిపించడం లేదు? అనే ప్రశ్నలు తేనెటీగల్లా ముసురుకుంటున్నాయి. వేధిస్తున్నాయి.

"వెళ్ళు అమ్మ మెలకువగానే ఉంది." ఆయన ఆమెని దాటి ముందుకు వెళ్ళిపోయాడు.

వెళ్తున్న ఆయనవైపు నిర్ఘాంతపోయి చూస్తూ, మధురిమ తీవ్రంగా ఆలోచించసాగింది.

పవిత్ర పదిహేను రోజుల క్రితం అకస్మాత్తుగా కళ్ళు తిరిగి పడిపోయింది వంట గదిలో. కిచెన్ ప్లాట్ ఫారం నుదుటికి కొట్టుకుని స్పృహ కోల్పోయింది.

అదృష్ట వశాత్తూ ఆ రోజు ఆదివారం అవడం వల్ల మధురిమ భర్త తో సహా తల్లి,తండ్రుల దగ్గరకు వచ్చింది. భోజనాలు అయాక మధురిమ, ఆమె భర్త అభిషేక్, శివరామకృష్ణ, హాల్లో కూర్చుని టి వి చూస్తుంటే, పవిత్ర వంటగది సర్దుకుంటోంది. సరిగ్గా అప్పుడే ధబ్ మనే శబ్దం, పవిత్ర ఆర్తనాదం వినిపించాయి. ముగ్గురూ పరిగెత్తుకుంటూ వెళ్ళి, ఆమెని లేపి వెంటనే హాస్పిటల్ కి తీసుకు వెళ్లారు.

సుమారు ఐదు రోజులు ఆవిడ స్పృహలో లేదు. ఐ. సి. యు లోనే ఉంది. ఆరవ రోజు కొద్దిగా కోలుకుంది. మరో నాలుగు రోజులు హాస్పిటల్ లోనే ఉంచి డిశ్చార్జ్ చేశారు కానీ ఆవిడ పూర్తిగా మంచానికి అతుక్కు పోయింది.

మధురిమ ఆ పది రోజులు ఆఫీసుకి లీవు పెట్టింది. ఆవిడ డిశ్చార్జ్ అయిన దగ్గర నుంచి ఆఫీసుకి వెళ్తోంది.

అప్పటి నుంచీ శివరామ కృష్ణ ఆవిడని కనిపెట్టుకుని ఉంటున్నాడు.

మధురిమ రోజు విడిచి రోజు ఆఫీసు నుంచి వచ్చి చూసి వెళ్తోంది. వచ్చి ఇక్కడే ఉండాలంటే పిల్లల స్కూల్స్ తను ఉంటున్న కొండాపూర్ కి బాగా దగ్గర. అందుకే కష్టం అయినా రోజు విడిచి రోజు వస్తూ తల్లిని కనిపెట్టుకుని ఉంటోంది. ఆయన ఒద్దని వారిస్తున్నా, మొత్తం భారం తండ్రి మీద వేయడం భావ్యంగా అనిపించక కొండాపూర్ నుంచి శ్రీనగర్ కాలనీకి వస్తోంది.

ఎన్నడూ లేనిది, ఈ నాలుగు రోజులుగా తల్లి నోటినుంచి మోహన్ ప్రస్తావన నాలుగైదు సార్లు విన్నది. అతనెవరో తనకి తెలియకపోడం చిత్రంగానే అనిపిస్తోంది.

మోహన్ ఎవరు? అమ్మ తనని అడక్కుండా నాన్నని మాత్రం ఆ వ్యక్తిని పిలిపించమని అడగడానికి కారణం ఏమిటి? నిజంగా నాన్న అతనికి ఫోన్ చేస్తున్నాడా? అబద్ధం చెబుతున్నట్టు తనకి స్పష్టంగా తెలుస్తోంది. ఎందుకు? తల్లి, తండ్రులకి అంత ముఖ్యమైన ఆ వ్యక్తి గురించి ఇంతకాలం తనకి తెలియకపోవడంలో ఏదన్నా రహస్యం ఉందా! తండ్రికి ఫోన్ లో దొరకని ఆ వ్యక్తి అంత గొప్పవాడా? బిజీ గా ఉండే వ్యాపారవేత్తనా? లేక విదేశాల నుంచి రావాల్సిన వ్యక్తా? ఆమెలో ఆశ్చర్యంతో పాటు కుతూహలం, పెరిగింది.

ఆ ఆసక్తితోటే ఆయన వెంట నడుస్తూ మళ్ళీ అడిగింది "చెప్పు నాన్నా! నేను తెలుసుకోకూడదా? నాకు అన్నలు గానీ, తమ్ముళ్ళు కానీ లేరుగా! దూరమైన బంధువా?" ఉద్వేగంగా అడిగింది.

ఆయన గట్టిగా అన్నాడు " వద్దమ్మా! నన్నేం అడక్కు... నాకేం తెలియదు... అవును నిజంగానే నాకు తెలియదు... నన్నేం అడక్కు " అంటూనే వేగంగా అక్కడినుంచి వెళ్ళిపోయాడు.

మధురిమ నిశ్చేష్టురాలై నిలుచున్న చోటే స్థాణువులా ఉండిపోయింది.

గదిలో మంచం మీద పడుకున్న పవిత్ర కళ్ళు మూసుకున్నా నిద్ర పట్టలేదు. కళ్ల ముందు ఏవేవో దృశ్యాలు కదులుతున్నాయి.

అనేక జ్ఞాపకాలతో మెదడు ఉక్కిరి, బిక్కిరి అవుతోంది.

ఎన్నో సంవత్సరాలుగా గుండెల్లో దాచుకున్న ఆవేదన ఇప్పుడు వెల్లువై పారుతోంది.

నుదుటి మీద గాయం తాలూకు నెప్పి కన్నా, గుండెకి తగిలిన గాయాల నెప్పి ఇప్పుడు ఎక్కువగా ఉంది. ఎవరో తన గాయాలను చాకుతో కదిపి, మళ్ళీ రేపినట్టు, మానిన గాయాల నుంచి రక్తం స్రవిస్తోంది. ఆ హాయాల తాలూకు బాధ విపరీతంగా ఉంది. ఇంతకీ ఆ గాయాలు ఎలా అయినాయి? ఎవరన్నా ఈ గుండెని కోసారా? లేదు. ఆ గాయం ఎవరూ చేసింది కాదు, తనకి తానే చేసుకుంది. అందుకు శిక్ష కూడా తానె అనుభవించింది. అనుభవిస్తూనే జీవించింది.

ఇంక తన మరణం ఎంతో దూరం లేదని ఆమెకి బలంగా అనిపిస్తోంది.

జీవితం అంచున నిలబడి ఉందని... ఏ క్షణం అయినా పట్టు తప్పి జీవనసంద్రంలో మునిగిపోతుందని గాఢంగా అనిపిస్తోంది .

ముప్పై ఏళ్ల ఈ వైవాహిక జీవితంలో తగిలిన చోటే ఎన్నో దెబ్బలు... అనేక గాయాలు.. రేగి, రేగి కాన్సర్ లా మారాయి. ఆ కాన్సర్ కి మందు కనిపెట్టిన శాస్త్రవేత్తలు ఎవరూ లేరు.

ఎన్నో రకాల కాన్సర్ లు.... లివర్ కాన్సర్, బ్రెస్ట్ కాన్సర్, బ్రెయిన్ కాన్సర్, లంగ్ కాన్సర్.. మొత్తం 200 రకాల కాన్సర్ లు ఉన్నాయని సైన్సు చెబుతోంది. కిమో థెరపీ ద్వారా జీవన ప్రమాణం పెంచుతున్నారు డాక్టర్స్. కానీ, స్త్రీ

హృదయానికి వైవాహిక జీవితం ద్వారా ఏర్పడే  కాన్సర్ కి ఎలాంటి థెరపీ లేదు. ఆ బాధ భరిస్తూ, సహిస్తూ జీవించాల్సిందే. తనూ  ఓర్చుకుంది.  కానీ, ఇప్పుడు ఈ చివరి మజిలీలో ఒక్క చిన్న థెరపీ కావాలి అనిపిస్తోంది. దాన్నే ఓదార్పు అంటారు. ఆ ఓదార్పు ఎవరో కలిగించేది కాదు, తను చేసిన పాపానికి కాలం చల్లే మంత్రజలం.

ఎలా? ఎలా చల్లుతుంది ఆ మంత్రజలం? తను ఎంతో కొంత పాపప్రక్షాళన చేసుకుంటేనే కదా! ఎలా ప్రక్షాళన చేసుకోవాలి? ఒక్కసారి ఏ గుండెని తన మాటలతో తూట్లు పొడిచిందో ఆ గుండె మీద క్షమార్పణ అనే లేపనం రాయాలి.

అందుకే ఆయనని, ఎవరి కారణంగా మరో వ్యక్తిని నిర్దాక్షిణ్యంగా అవమానించిందో ఆయనని సిగ్గువిడిచి ప్రాధేయపడుతోంది ఒక్కసారి ఆ వ్యక్తిని పిలిపించమని.

అతను రావాలి. చేసిన తప్పుకి  తన గుండె లోతుల నుంచి  క్షమార్పణ అడగాలి.  అతని క్షమతో కూడిన చల్లని చూపు తగిలితే చాలు. అదే ఈ కాన్సర్ ని  మాన్పే మందు... అదే థెరపీ.

“నన్ను క్షమించు” అని ఒకే మాట చెప్పాక అతని కళ్ళల్లో కనిపించే ఆనందాన్ని చూడగలిగితే అదే ఈ గాయపడిన గుండెకి ఒక చల్లని లేపనం అయి, మనశ్శాంతిని ఇవ్వగలదు.

ఒక్కసారి ఈ ప్రపంచం నుంచి నిష్క్రమించాక ఆ సాంత్వన లభించదు కదా!

నిజానికి తను తప్పు చేసిందో, లేదో తనకి తెలియదు.

ఎప్పుడైతే భ్రమ నుంచి బయటపడిందో ఆ క్షణం నుంచీ అపరాధ భావనతోటే జీవిస్తోంది. .. ఆ భావన తొలగిపోవాలన్నా , తాను మనశ్శాంతిగా కన్ను మూయాలన్నా క్షమార్పణ అడగాల్సిన అవసరం  ఉంది.

ఏ కారణం చేత అతన్ని అవమానించిందో అదే తన పాలిట శాపం అయి జీవితంలో సుఖశాంతులను దూరం చేసింది.

స్నేహితుడు, ప్రియుడు, భర్త, హితుడు, ఆత్మీయుడు అన్నీ  అనుకుని మూడు ముళ్ళు వేసిన వ్యక్తి  తను ఊహించుకున్నంత ప్రేమగా, అనురాగంగా తనని చూసుకుని ఉంటే ఈ అపరాధ భావన ఉండేది కాదేమో!

ఇన్నేళ్ళ తరవాత కూడా అతన్నే తలచుకుంటూ, అతను తనకి అందచేస్తానన్న జీవితానికి, గడుపుతున్న జీవితానికి పోల్చి చూసుకుంటూ కోల్పోయిన జీవన మాధుర్యం తలచుకుని బాధపడని క్షణం లేదు. అది లోకం దృష్టిలో అనైతికం కావచ్చు ... కానీ తన దృష్టిలో అదే నైతికం.

ఏ వ్యక్తిని మనసారా ప్రేమించిందో, ఏ వ్యక్తితో జీవితం రసభరితంగా ఓ మధురమైన కావ్యంలా గడిచిపోతుందని భావించిందో, ఏ వ్యక్తితో  నది ఒడ్డున, పొలం గట్ల మీద, సినిమా హాల్లో భావి జీవితం గురించి కలలు కన్నదో, ఏ వ్యక్తితో నూరేళ్ళ జీవితానికి సురక్షితమైన మార్గం వేసుకుందో ఆ వ్యక్తి తనపాలిట శాపం అయినాడు. ఆ శాపం ఏ దేవుడు ఇచ్చాడు? తనే శపించుకుంది.

ఈ మనిషి నావాడు, నా స్వంతం... నాకోసం పుట్టాడు అనుకుంది. తనూ అతని కోసమే పుట్టాను అనుకుంది. కానీ, కానీ... ఆమెకి దుఃఖం ఎగదన్నింది.

"నాది, నాది అనుకున్నది నీది కాదురా– నీవు రాయన్నది ఒకనాటికి రత్నమవునురా... "

రెప్పల మీద నిలిచిన కన్నీటి బిందువులు జల్లులు, జల్లులుగా కురుస్తున్నాయి. ఆ జల్లుల్లో తన బతుకు చరిత్రలోని పుటలు, ఒకొక్కటే కదిలిపోసాగాయి.

"అమ్మా! " మధురిమ పిలుపుకి ఆవిడ ఉలిక్కిపడింది.

మంచానికి దగ్గరగా నిలబడి, కొంచెం ఒంగి తన మొహంలోకి చూస్తోంది మధురిమ.

"నువ్వు వచ్చి ఎంతసేపు అయింది?" తడబడుతూ అడిగింది.

'నువ్వు మోహన్ గురించి నాన్నతో మాట్లాడుతున్నప్పుడు వచ్చాను' అనాలి అనుకుంది మధురిమ. కానీ అనలేదు."చాలాసేపు అయింది. నువ్వు పడుకున్నావని చెప్పాడు నాన్న. అందుకే డిస్టర్బ్ చేయలేదు. చెప్పమ్మా! ఏమన్నా కావాలా!" అడిగింది.

"కాసిని మంచినీళ్ళు ఇవ్వు" అంది ఆవిడ.

మధురిమ టేబుల్ మీద ఉన్న మగ్ లో నుంచి, గ్లాసులో నీళ్ళు పోసి ఆవిడ పక్కన మంచం మీద కూర్చుని, ఎడం చేయి తల కింద వేసి కొంచెం ఆవిడని లేపి నీళ్ళు తాగించింది.

చాలు అన్నట్టు ఆవిడ చేయి ఎత్తింది. మధురిమ మగ్ టేబుల్ మీద పెట్టింది.

"నాన్న పడుకున్నారా?" అడిగింది ఆవిడ.

మధురిమ తల ఊపింది. "పాపం! రాత్రంతా మేలుకున్నారు" అందావిడ సానుభూతిగా.

మధురిమ ఎప్పుడు చూసినట్టే ఆవిడ వైపు విచిత్రంగా చూసింది.

చిన్నప్పటి నుంచీ చూస్తోంది. ఇదే సానుభూతి ఆవిడ స్వరంలో. ఇదే కన్సర్న్.

తనకి గుర్తుంది తండ్రి ఎప్పుడూ తల్లితో ప్రేమగా, అనుకూలంగా, ఆత్మీయంగా మాట్లాడలేదు. ఆవిడ ఏం మాట్లాడినా విసుక్కునేవాడు. ఒక్కోసారి తన ముందే అమ్మని కొట్టడానికి చేయి ఎత్తేవాడు. మళ్ళీ తనని చూసి చేయి దించి వెళ్ళిపోయేవాడు.

"ఎందుకమ్మా నాన్నకి అంత కోపం " అని అడిగితే, "హాస్పిటల్ లో రక,రకాల పేషంట్లతో విసిగిపోతారు గా తల్లీ ! మళ్ళీ నేను కూడా విసిగిస్తే కోపం వస్తుంది మరి." అనేది.

"నువ్వేమి విసిగించలేదే! ఇంటికి ఎన్నింటికి వస్తారు? టిఫిన్ కారియర్ ఇవ్వనా! డ్రైవర్ ని పంపిస్తారా! నాకు తల నెప్పిగా ఉంది ఏవన్నా మాత్రలు ఇస్తారా?" ఇలాంటివేగా... వీటిలో ఆయనకి విసుగు తెప్పించేవి ఏం ఉంటాయి! అని అడగాలని అనిపించేది. కానీ అడగలేదు.

మధురిమకి తల్లిని చూస్తుంటే, అరిగిపోయిన గంధం చెక్కలా అనిపించింది.

తన చిన్నప్పుడు అమ్మకి ఎంత పెద్ద జడ ఉండేది! ఆ జడ పట్టుకుని ఆవిడ వెనక తిరిగేది తను. అమ్మ నవ్వుతూ, "కొంగట్టుకు తిరుగుతూ ఏవో ప్రశ్నలడుగుతూ అని వేదవతి పాడారు. నేను నా జడ పట్టుకు తిరుగుతూ ఏవో ప్రశ్నలడుగుతూ అని పాడుకోవాలేమో కదే" అనేది.

అమ్మ నవ్వితే ఎంత బాగుండేది! ఆ నవ్వుల్లోంచి ఏవో ధారలుగా జారుతున్నట్టు ఉండేది. అదేవిటి అని చిన్నప్పటి నుంచీ ఆలోచిస్తూ ఉంటే కొంచెం పెద్దయ్యాక తెలిసింది వెన్నెల జలతారులు అని.

అమ్మ స్వరం ఎంత తీయగా ఉండేది!

అమ్మ ఎప్పుడన్నా కూనిరాగం తీయడం చెవిన బడితే నిప్పు తొక్కిన కోతిలా చిందులేసేవాడు నాన్న. "ఆపు... పెద్ద సుబ్బలక్ష్మి బయలుదేరింది. నీ గొంతు... నువ్వు..." అని కర్కశంగా అనేవాడు.

అమ్మ టక్కున ఆపేసేది.

నాన్న ఏమన్నా అమ్మ ఎదురుచెప్పకపోవడం, నోరు మూసుకో అనగానే మూసుకోడం, ఇవన్నీ చూస్తూ ఉంటే అమ్మ ఏదన్నా తప్పు చేసిందా? ఎందుకు నాన్న దగ్గర అంత ఒదిగి ఉంటుంది " అనిపించేది.

"మధూ! ఆఫీస్ పని లేదా ఇవాళ?" అడిగింది పవిత్ర.

ఆలోచనల నుంచి తెప్పరిల్లి, "లేదమ్మా! ఇవాళ వీక్ ఆఫ్" అంది.

"ఓ! పిల్లలు ఎలా ఉన్నారు? ఓసారి తీసుకురా తల్లి. చూడాలని ఉంది."

"పరీక్షలు దగ్గరకి వస్తున్నాయి. అవగానే తీసుకుని వస్తాను. "

"సరే!" ఆవిడ కళ్ళు మూసుకుంది అలసటగా.

మధురిమ మంచం అంచు మీద కూర్చుని మృదువుగా పిలిచింది "అమ్మా!"

ఆవిడ కళ్ళు తెరిచింది. "చెప్పు తల్లి " అంది.

మధురిమ సందేహిస్తూ అడిగింది "మోహన్ ఎవరు? ఆయనని చూడాలని నువ్వెందుకు తపిస్తున్నావు? మనకి బంధువా?"

పవిత్ర పక్కన నుంచి రెండు మిస్సైల్స్ దూసుకువెళ్ళినట్టు ఉలిక్కిపడింది.

"నీ... కు... ఎలా తెలుసు?" అడిగింది.

మధురిమ పల్చగా నవ్వింది. "ఎలాగోలా తెలుసు. కానీ నాకు చెప్పు ఎవరు మోహన్?"

పవిత్ర కళ్ళు నీటి తో నిండాయి.

"చెప్పమ్మా! నాన్న ఈ ప్రస్తావన రాగానే ఎందుకో ముడుచుకుని పోతున్నారు. నువ్వేమో నాన్నని ప్రాధేయపడుతున్నావు అతనికి ఫోన్ చేయమని. ఎవరతను? "

"మధూ! ఈ ఒక్క విషయం నన్ను అడగద్దు. ఇది పూర్తిగా నా వ్యక్తిగత విషయం. "

"మరి నాన్నని ఎందుకు అడుగుతున్నావు "

"ఆయనకి తెలియని విషయాలు నాకు ఏవీ లేవు… ఆయన నా భర్త … ఆయన దగ్గర కొన్ని దాస్తే నేరం, పిల్లల దగ్గర అవి బహిర్గతం చేస్తే నేరం. "

"ఓ అంటే నువ్వు నేరం చేసావా? మోహన్ అనే వ్యక్తి నీ జీవితంలో అతి ప్రధానమైన వ్యక్తా? అంటే పెళ్ళికి ముందు…"

"మధూ!" వేటగాడి బాణం దెబ్బ తగిలిన పక్షిలా విల,విల తన్నుకుంటూ చూసింది.

"భయపడకు … ఆయనని నేను పిలిపిస్తాను. ఆయన వివరాలు నాకు చెప్పు. నాన్న మాత్రం ఎప్పటికీ పిలిపించరు. ఇది నిజం" అంది.

పవిత్ర కూతురి వైపు నిర్విణ్ణురాలై చూసింది.

మధురిమ ఆవిడ నుదుటి మీద పడిన ముంగురులు సవరిస్తూ అంది "చెప్పమ్మా! నేను నీకు సాయం చేస్తాను. నీ కోరిక తీరుస్తాను. నన్ను నమ్ము."

కూతురి స్పర్శ లో ఆవిడకి ఏదో హాయి కనిపించింది… ఎంతో కాలంగా తను ఎదురుచూస్తున్న ఓదార్పు కనిపించింది. ఆ చేయి గట్టిగా పట్టుకుని అంది. "నిజంగా సాయం చేస్తావా?"

"నా మీద నమ్మకం లేదామ్మా!" మృదువుగా అడిగింది మధురిమ.

ఆవిడ జీవం లేని కళ్ళల్లోకి నెమ్మదిగా ప్రభాత కిరణాలు ప్రపంచాన్ని ఆవరించుకున్నట్టు వెలుగు ప్రసరించసాగింది . కూతురు మాటల పట్ల అంతులేని విశ్వాసం కలుగుతోంటే "చెప్తాను… తప్పకుండా" అంది.

"సరే రేపు వస్తాను. నాన్నని ఏదో ఒక పని మీద బయటకి పంపిస్తాను. అప్పుడు సావకాశంగా మాట్లాడుకుందాం సరేనా!" అంది మధురిమ.

ఆవిడ తలాడించింది.

మధురిమ మధురంగా నవ్వి "పడుకో" అంటూ దుప్పటి సరిగా కప్పింది.

లైట్ ఆఫ్ చేసి, బెడ్ లైట్ వేసి, గదిలో నుంచి బయటకు వెళ్ళిపోయింది.

వెళ్తున్న మధురిమ వైపు తాను కోల్పోయిన వాటిని ఎన్నో వెతుక్కుంటూ వెళ్తున్నట్టు, ఆమె చూపులు కూడా అనుసరించసాగాయి.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS